# నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, గురువారం 1 మే 2025 | PEDDAPALLI




విద్యార్థి ఎండీ నోమన్‌ను అభినందిస్తున్న పాఠశాల కరస్పాడెంట్ ఇస్మాయిల్

## యూనివర్సల్ ప్రభంజనం

పాలకుర్తి, ఏప్రిల్ 30: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో పాలకుర్తి మండలం ఘన్ శ్యాందాస్‌నగర్ పంచాయతీ పరిధి యూనవర్సిల్ ఐఐటీ ఫౌండేషన్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎండీ నోమన్ 588 మార్కులతో మండలంలో మొదటి స్థానంలో నిలువగా, ఎన్ అనన్యశ్రీ 583 మార్కులు, ఈ రోషిణి 581 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానం, బీ అక్షిత 580 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచారు. అలాగే పాఠశాలలో 71మంది విద్యార్థులకు 500పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. వీరిని పాఠశాల కరస్పాడెంట్ మహమ్మద్ ఇస్మాయిల్ అభినందించారు. ఈ నూతన విద్యాసంవత్సరంలో ఐఐటీ, జేఈఈ, నీట్ ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు.



పుట్టిన బిడ్డతో డాక్టర్ అమరేందర్‌రావు

## సర్కారు దవాఖానలో వైద్యాధికారి భార్య ప్రసవం

ముత్తారం, ఏప్రిల్ 30: పెద్దపల్లి ఎంసీహెచ్ ప్రభుత్వ దవాఖానలో ముత్తారం మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్‌రావు భార్య దివ్య ప్రసవించారు. మొదటి కాన్పులో భాగంగా నెలలు నిండడంతో పెద్దపల్లిలోని ఎంసీహెచ్ ప్రభుత్వ దవఖానలో ఆడ్మిట్ చేయించారు. కాగా, ఆమె ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని పలువురు ఉన్నతాధికారులు అభినందించారు.

## పోలీసుల పహారాలో ఓసీపీ-2 విస్తరణకు భూసర్వే

రామగిరి ఏప్రిల్ 30: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-2 ప్రాజెక్ట్ విస్తరణ చేపట్టడంలో భాగంగా బుధవారం భారీగా పోలీస్‌ల పహారాలో ఎస్టేట్ అధికారులు సర్వే నిర్వహించారు. దీంతో భూనిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి అధికారుల తీరు మారడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మా అనుమతి లేకుండా భూములను ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఓసీపీ-2 ప్రాజెక్ట్ విస్తరణ కోసం రాజాపూర్, లద్నాపూర్, అక్కెపెల్లి గ్రామలకు చెందిన 88 ఎకరాల భూమి సింగరేణి అత్యవసరం కాగా ఈ భూమి లేకుండా ఓసీపీ-2 ప్రాజెక్ట్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రశ్నార్థకంగా మారుతుందని భావించిన అధికారులు నిర్వాసితుల ప్రమేయం లేకుండానే సర్వే చేయడం అక్కడి గ్రామస్తులు అడ్డుకోవడం పరిపాటి గానే మారింది. ఈ విషయంలో కొద్దిరోజులుగా సింగరేణి అధికారులు, రాజాపూర్ గ్రామస్తుల మధ్య గందరగోళ పరిస్థితి నెలకొన్నది. అయినప్పటికీ గతం లో చేసిన అవార్డు ప్రకారం పంట భూ ములు, తమ ఇండ్లతో సహా తీసుకొని తగిన పరిహారం అందించి ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీని కల్పించి, యువతకు ఉపాధి, ఉద్యోగాలు ఇస్తే తమ భూములు ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదంటున్నారు.









మాట్లాడుతున్న దళితబంధు సాధన ఐక్య పోరాట సమితి నాయకులు

## దళితబంధు ఇవ్వకుంటే కాళేశ్వరం నుంచి పాదయాత్ర

**ఐక్య పోరాట సమితి నాయకులు**

మంథని, ఏప్రిల్ 30: రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో మంథని నియోజవకర్గంలోని కాళేశ్వరం నుంచి 100 డప్పులతో హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహిస్తామని నియోజకవర్గ దళితబంధు సాధన ఐక్య పోరాట సమితి డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గద్దెల శంకర్ స్పష్టం చేశారు. మంథని ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో రెండో విడుత దళితబంధు 1100 మందికి మంజూరు చేసి కలెక్టర్ ఎంపిక చేశారని, ఎంపికైన దళితులకు గత ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేసి కలెక్టర్ అకౌంట్లో జమ చేసిందని గుర్తు చేశారు. ఫ్రీజింగ్‌లో ఉన్న అమౌంట్‌ను లబ్ధిదారులకు జమ చేయాలని జీవో జారీ చేసినప్పటికీ మంథని నియోజకవర్గంలో దళితులకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి వినతి పత్రం సమర్పించాని, పార్టీలకతీతంగా దళితులను లక్షాధికారులను చేసేందుకు దళితబంధు నిధులు విడుదల చేయాలని కోరారు. రెండో విడుత లబ్ధిదారులుగా ఎంపికైన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లోగా నిధులు విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో కాళేశ్వరం నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి ఉపాధ్యక్షుడు ఆర్ల స్వామి, డివిజన్ నాయకులు పోయిల తిరుపతి, డివిజన్ నాయకులు గడ్డం లక్ష్మీనారాయణ, జూల రమేశ్ పాల్గొన్నారు.











